మిర్చి కాంటాలు ఆలస్యం

- మార్కెట్‌లో రైతుల ఆందోళన
- రోజురోజుకూ రేటు తగ్గుతున్నదని ఆందోళన

కాంటా చిట్టీలు ఇవ్వాలని ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

మహబూబాబాద్ రూరల్, మార్చి 25 : వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కాంటాలు కావడం లేదని మంగళవారం సాయంత్రం మార్కెట్‌లో రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు ధరావత్ కిషన్,రమేశ్, వీరన్న, లాలు మాట్లాడుతూ.. నాలుగు రోజుల క్రితం మార్కెట్‌కు మిర్చి బస్తాలు తీసుకొచ్చామని, ఇప్పటివరకు కాంటాలకు సంబంధించిన చిట్టీలు ఇవ్వలేదన్నారు. పగలు, రాత్రి ఇక్కడే ఉంటున్నా, రైతుల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆన్‌లైన్ రసీదు పేరిట తీవ్ర జాప్యం చేస్తూ ఇబ్బంది పెడుతున్నారని, చిట్టీ వచ్చినా మిర్చి బస్తాలను కాంటా పెట్టడం లేదన్నారు. బస్తాలు మొత్తం బయటనే ఉన్నాయని, వానపడితే మిర్చి మొత్తం ఆగమవుతుందని, వ్యవసాయ అధికారులు మాత్రం పట్టింపు లేకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు రోజురోజుకూ రేటును తక్కువ చేస్తూ, కాంటాలు సకాలంలో పెట్టడం లేదన్నారు. మార్కెట్‌కు మిర్చి బస్తాలు తెచ్చి అరిగోస పడుతున్నామన్నారు. కాగా, ఘటనా స్థలానికి టౌన్ సీఐ దేవేందర్ చేరుకొని రైతులకు సర్ది చెప్పి మార్కెట్ సెక్రటరీ షంశీర్‌తో మాట్లాడి కాంటా చిట్టీలను రైతులకు ఇప్పించారు.

ఎమ్మెల్సీ రవీందర్‌రావును సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎమ్మెల్సీ రవీందర్‌రావుకు సన్మానం

మహబూబాబాద్ రూరల్ : ఆఫ్రికా స్టడీ టూర్‌ను ముగించుకొని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మంగళవారం తిరిగి మానుకోటకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తేళ్ల శ్రీను, లూనావత్ అశోక్‌నాయక్, సుధగాని మురళి, నాయిని రంజిత్‌కుమార్, నర్సింగ్ వెంకన్న, ఆవుల వెంకన్న పాల్గొన్నారు.

కురవి: రైతు వెంకటేశ్వర్లుకు బస్తాలను అందజేస్తున్న దేవేందర్, కానిస్టేబుల్ రమేశ్

పోగొట్టుకున్న మిర్చి బస్తాలు అప్పగింత

కురవి, మార్చి 25 : పోగొట్టుకున్న మూడు మిర్చి బస్తాలను తిరిగి రైతుకు అప్పగించిన ఘటన మంగళవారం మండలంలో జరిగింది. గార్ల మండలం పోచారం గ్రామానికి చెందిన రైతు సుఖారా వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి మూడు మిర్చి బస్తాలను మానుకోట మార్కెట్‌కు తరలిస్తుండగా కురవి మండలం బంచరాయి తండా వద్ద పోగొట్టుకున్నాడు. బయ్యారం నుంచి బైక్‌పై పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బానోత్ దేవేందర్ బ్రిడ్జి వద్ద మూడు మిర్చి బస్తాలు పడి ఉండడాన్ని గమనించి వెంటనే కురవి పోలీసులకు సమాచారం అందజేశాడు. మూడు బస్తాలను తండా స్టేజీ వద్ద దాచి ఉంచి, వెంటనే విషయాన్ని సంబంధిత రైతుకు చేరవేశారు. మంగళవారం బంచరాయితండా వద్దకు రైతు వెంకటేశ్వర్లు రావడంతో కురవి కానిస్టేబుల్ రమేశ్, దేవేందర్ మిర్చి బస్తాలను రైతుకు అప్పగించారు. పోగొట్టుకున్న మిర్చి బస్తాలను తిరిగి రైతుకు అప్పగించిన దేవేందర్, కానిస్టేబుల్ రమేశ్‌ను తండావాసులు అభినందించారు.

భ్రూణ హత్యలకు పాల్పడొద్దు

మహబూబాబాద్ రూరల్ : భ్రూణహత్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడ పిల్లలను రక్షించడం, చదివించడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. భ్రూణ హత్యలను నివారించి బాల్య వివాహాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సౌమ్యశ్రీ, సుభద్ర, భవాని, దీపిక, ప్రియాంక, వాసవి పాల్గొన్నారు.

ఆటో బోల్తా ముగ్గురికి గాయాలు

కేసముద్రం, మార్చి 25 : మండలంలోని వెంకటగిరి సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ముగ్గురు మహిళలకు గాయాలైనట్లు ఎస్సై మురళీధరరాజు మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నెక్కొండ మండలం పెద్దకొర్పోల్ గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు ఇనుగుర్తి మండలం కోమటిపల్లిలో వారి బంధువుల ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో బిర్రు సుగుణ, మర్యమ్మ, మేఘనకు గాయాలయ్యాయి. చికిత్స కోసం108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

TOURS & TRAVELS
★16/04/25 అయోధ్య, కాశీ, నేపాల్, ముక్తినాథ్ యాత్ర & 09/05/25 సరస్వతీ పుష్కరాలు, చార్‌ధామ్ యాత్ర. రై+బ+భో+వ. భాగ్యలక్ష్మి టూర్స్. Ph: 9397617094.
NT-1899

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

430 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చూపుతున్న సివిల్ సప్లయ్ అధికారులు

నెల్లికుదురు, మార్చి 25 : నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న 430 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రేమ్‌చంద్ కథనం ప్రకారం... ఆలేరు గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి రైస్ మిల్లు మేనేజర్ గోవర్ధన్ చుట్టు పక్కల గ్రామాల్లో తెల్లరేషన్ కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, మిల్లులో క్లీనింగ్, పాలిస్ చేసి వరంగల్‌లోని సాయిలక్ష్మీ రైస్ మిల్లు ద్వారా అమ్మకాలు చేపడుతూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నాడు. మంగళవారం మిల్లు నుంచి 430 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలిస్తుండగా సివిల్ సప్లయ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. గోవర్ధన్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేస్తామని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేటి నుంచి అన్ని రైస్‌మిల్లుల్లో ముమ్మరంగా తనిఖీ కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పురుగు మందుల వినియోగం తగ్గించాలి

రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కేసముద్రం, మార్చి 25: రైతులు పురుగు మందులు, ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, ప్రకృతిసాగుపై దృష్టి సారించాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు రైతులకు సూచించారు. న్యాచురల్ ఫార్మింగ్ విధానం, సోలార్ ఫెన్సింగ్, పంటల మార్పిడిపై మంగళవారం రైతులకు కల్వల గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వాతి, సంజన, సల్మా, హిమ, ప్రియాంక మాట్లాడుతూ.. నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలని, పంటల మార్పిడి చేస్తే భూమిలో పోషక విలువలు పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. పురుగు మందులు, ఎరువులను అధిక మొత్తంలో వినియోగించడం వల్ల ప్రజలు అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆకుల సుధాకర్, చింతనూరి రమేశ్, పెరటి వెంకట్రామ నర్సయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పామాయిల్ తోట దగ్ధం

కురవి, మార్చి 25 : మండలంలోని మొగిలిచర్లలో మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పామాయిల్ తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు నంద్యాల హేమరాజుకు చెందిన 13 ఎకరాల్లో పామాయిల్ తోటను సాగు చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం గుట్టల వద్ద మీదుగా వచ్చిన నిప్పురవ్వలు తోటలో పడి అంటుకొని 20 చెట్లు, డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. ప్రభుత్వం రైతుకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

రూ.21లక్షలకు అంగడి వేలం

కేసముద్రం, మార్చి 25 : పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన అంగడి వేలం రూ.21.15లక్షలు పలికినట్లు ఆర్‌వో కుమార్ తెలిపారు. కమిషనర్ ప్రసన్నారాణి ఆదేశాల మేరకు మంగళవారం వేలంపాట నిర్వహించినట్లు తెలిపారు. ఆరుగురు పాల్గొనగా మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ భట్టు శ్రీనివాస్ రూ.21,15,000కు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ వేలంలో ఆర్‌ఐ ప్రభాకర్, బిల్ కలెక్టర్ రాము, సంతోష్ ఉన్నారు.

తాగుడుకు బానిసై ఒకరి మృతి

తొర్రూరు, మార్చి 25 : మందుకు బానిసై అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం తొర్రూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చీకటాయపాలెం గ్రామానికి చెందిన పాండవుల యాకన్న(33)కు భార్య అనూష, కుమార్తె, కొడుకు ఉన్నారు. అనూష ఐదేళ్ల క్రితమే యాకన్నను విడిచి హైదరాబాద్‌కు వెళ్లింది. కూలి పని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్నది. అతిగా తాగుతున్న యాకన్నను అదుపులో పెట్టాలని భావించిన కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం అతడి అక్క లలిత స్వగ్రామమైన బ్రాహ్మణకొత్తపల్లికి తీసుకెళ్లింది. తాగకుండా ఇంటి వద్దే ఉంచింది. అయితే, మంగళవారం ఉదయం ఎవరూ లేని సమయంలో యాకన్న మద్యం తాగి మత్తులో బ్రాహ్మణకొత్తపల్లి నుంచి తొర్రూరుకు కాలినడకన బయలుదేరాడు. మార్గమధ్యంలో దారి తప్పి సోమారపుకుంట తండా సమీపంలోని ఓ చెట్టు కింద మృతిచెందాడు. తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, యాకన్న మద్యానికి బానిసై ఎక్కువ తాగడం వల్ల ఈ ఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

మిల్లుల వద్ద కొనుగోళ్లు నిలిపేయాలి

కేసముద్రం : మిల్లుల వద్ద పంట ఉత్పత్తుల కొనుగోళ్లను వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఏఐసీటీయూ ఆధ్వర్యంలో కార్యదర్శి అమరలింగేశ్వరరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ.. వ్యాపారులు మార్కెట్‌లో కాకుండా మిల్లుల్లో కొనుగోలు చేయడం వల్ల తూకంలో తేడా, కార్మికులు ఉపాధి కోల్పోవల్సి వస్తున్నదన్నారు. పంట ఉత్పత్తులను ఖరీదు చేసిన వ్యాపారులు నేరుగా డబ్బులు ఇస్తూ, కమీషన్ పేరుతో కోత విధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బొల్లోజు రామ్మోహనాచారి, వేల్పుల వెంకన్న, బానోత్ ఈసు, పుల్లన్న, వెంకన్న పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద వసతులు కల్పించాలి

నర్సింహులపేట, మార్చి 25: ఉపాధి పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న కోరారు. మంగళవారం మండలంలోని బొజ్జన్నపేటలో ఉపాధి పనులను పరిశీలించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి నిధులు తగ్గిస్తూ పథకాన్ని రద్దు చేసే కుట్రలు చేస్తున్నాయన్నారు. కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.600 చెల్లించాలని, పని ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్, నీడ వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిర్ర యాకన్న, ఎస్‌కే సాజన్, శ్రీను, ముఖేశ్, యాకయ్య వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

మరిపెడ, మార్చి 25 : ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. మంగళవారం మరిపెడ పురపాలక సంఘం పరిధిలోని బీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు వివరిస్తూ, న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు న్యాయం చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దార్ల శివరాజ్, జిల్లా నాయకులు విజయకాంత్, అభినాయక్, జిల్లా అధ్యక్షుడు ఈసంపల్లి ఉపేందర్, జిల్లా కార్యదర్శి ఎడ్ల శ్రీను పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

తొర్రూరు కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తొర్రూరు మార్చి 25: హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయిల్ హత్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం తొర్రూరు బార్ అసోసియేషన్ నిరసన తెలిపింది. న్యాయవాదులపై జరుగుతున్న దాడులు న్యాయవ్యవస్థనే కుదిపేస్తున్నాయని, ఇలాంటి ఘటనలు సామాజిక అస్థిరతకు దారితీస్తాయని అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఘనపురం రామకృష్ణ అన్నారు. ఇలాంటి పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరుస్తాయన్నారు. దేశంలో న్యాయవ్యవస్థపై నమ్మకం కోల్పోకుండా ఉండాలంటే న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వల్లపు మధుసూదన్, ముకుందారావు, పొడకంటి యాకాంబరం, రఘురామ్‌రెడ్డి, వల్లపు అయిలోని, బానోత్ లాలు, ధరావత్ నగేశ్, భాస్కర్, వెంకటేశ్వర్లు, యాకేందర్, గోపాల్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, సురేశ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేయాలి

అధికారులను నిలదీసిన గ్రామస్తులు

నర్సింహులపేట, మార్చి 25: అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మంగళవారం మండలంలోని వంతపడలలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. గ్రామసభలో ఇందిరమ్మ ఇల్లు పత్రం అందించిన వారి పేర్లు లిస్టులో ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఇల్లు ఉన్నవారికే ఇల్లు మంజూరు చేశారని, నిరుపేద కుటుంబాలు, అద్దెకు ఉంటున్న, ఇల్లు కూలిపోయిన వారి పేర్లు లిస్టులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది అధికారులు డబ్బులు ఇచ్చిన వారికి మాత్రమే పేర్లు మాత్రమే లిస్టు పెట్టారని అన్నారు. 105 మందికి ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ ఇండ్ల మంజూరు పత్రాలు ఇచ్చారని, 65 మందికి మొదటి విడతలో ఇండ్ల నిర్మాణం కోసం ముగ్గులు పోస్తామని ఎంపీడీవో యాకయ్య తెలిపారు.

ఎల్ఆర్ఎస్‌పై నిర్లక్ష్యం తగదు

తొర్రూరు : ఎల్ఆర్ఎస్‌ను నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టోప్పో అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన తొర్రూరు మున్సిపాలిటీ, మండల పరిషత్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలించారు. అధికారులు సమయపాలన పాటించకుండా ప్రజలను ఇబ్బందిపెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. వెలికట్టె గ్రామాన్ని సందర్శించి, ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు వివరాలను తెలుసుకున్నారు. ఫీజుల వసూలు సరిగ్గా లేదని, ఆయా విభాగాల మధ్య సమన్వయం లోపించిందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి దరఖాస్తును ప్రాసెస్ చేయాలని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చారు. అనంతరం తొర్రూరులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందిస్తున్నారా.. లేదా అని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచందర్, ము నిసిపల్ కమిషనర్ శాంతికుమార్, ఆర్ఐ బషీర్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

మరిపెడ, మార్చి 25 : ఎల్లంపేట గ్రామానికి చెందిన బత్తెం శ్రీను–చంద్రకళ దంపతుల కొడుకు అజయ్(22) ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందాడు. కాగా, మంగళవారం అతడి శ్రీనుకు తన చిన్ననాటి స్నేహితులు, ఎల్లంపేట స్కూల్‌లో 1997–98 పదో తరగతి విద్యార్థులు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

సంస్కృతిని గౌరవించాలి

నెల్లికుదురు, మార్చి 25 : ప్రతి ఒక్కరూ మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో మంగళవారం 'ఏక్ భారత్ –శ్రేష్ఠ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల హర్యానా రాష్ట్ర వేషధారణలో అలరించారు. విద్యార్థులకు హర్యానా రాష్ట్ర ఆచార వ్యవహారాలు, సంస్కృతి, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు నబీ, సుల్తానా, సతీశ్, నా గమోహన్‌రావు, యుగేంధర్, లక్ష్మణ్, కవిత పాల్గొన్నారు.

వీవోఏల అరెస్టు అక్రమం

దంతాలపల్లి : న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేసేందుకు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా వీవోఏలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని సంఘం మండల అధ్యక్షుడు చిల్లా నిరంజన్ అన్నారు. మంగళవారం తెలవారుజామునే తమను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని అన్నారు. కనీస వేతనం రూ.25వేలు అందిం చి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

సైన్స్, గణిత శాస్త్రవేత్తలుగా ఎదగాలి

డోర్నకల్, మార్చి 25: విద్యార్థులు పట్టుదలతో చదివి సైన్స్, గణిత శాస్త్రవేత్తలుగా ఎదగాలని జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం నరసింహారావు అన్నారు. మంగళవారం డోర్నకల్ జడ్పీహెచ్ఎస్‌లో పీఎంశ్రీ పథకంలో భాగంగా విజ్ఞానశాస్త్రం, గణిత శాస్త్రం ఇంటరాక్షన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రసాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణించాలన్నారు. సైన్స్,గణితశాస్త్రాల్లో ప్రతిభ కనబర్చడానికి 75మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 9వ తరగతి విద్యార్థిని జాస్మిన్‌కు సైన్స్‌ఇన్‌స్పైర్ అవార్డు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, వసంతరాణి,అమీనా, మంజులత, రమేశ్, సాహెబ్ అలీ, వెంకటేశ్వర్లు, శ్యామల, మాలతి పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో ఒకరికి ఏడాది జైలు

మహబూబాబాద్ రూరల్ : ఘర్షణ కేసులో ఒకరికి ఏడాదిపాటు జైలు శిక్ష పడింది. కోర్ట్ కానిస్టేబుల్ సురేశ్ కథనం ప్రకారం.. మూడు సంవత్సరాల క్రితం అమనగల్ శివారు పెద్దతండాకు చెందిన గుగులోత్ పర్తియా పొలం పనిచేస్తుండగా తన పొలం పక్కనే ఉన్న ఇస్లావత్ శ్రీకాంత్ పాత కక్షలు మనసులో పెట్టుకొని పర్తియాను రాయితో కొట్టడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా,అప్పటి ఎస్సై రమేశ్‌బాబు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాడు. అనంతరం కేసు చార్జిషీట్‌ను కోర్టులో ప్రవేశపెట్టగా, ప్రస్తుత ఎస్సై దీపిక సాక్షులతో కోర్ట్‌లో హాజరుపర్చగా, మంగళవారం అడిషినల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ తిరుపతి శ్రీకాంత్‌కు ఏడాది జైల్ శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

రైతు భరోసా ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

మరిపెడ, మార్చి 25 : రబీ పూర్తవుతున్నా రైతుల బ్యాంకు ఖాతాల్లో భరోసా డబ్బులు జమ చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మరిపెడ మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా ఎన్ని ఎకరాలకు, ఎప్పటివరకు ఇస్తారో ప్రకటించకపోవడంతో రైతులు అయోమయంలో ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, అబ్దుల్‌రషీద్, పోలేపాక వెంకన్న, మల్లెపాక యాకన్న పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 25 : అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గాలి, దుమ్ము, రాళ్ల వానకు మక్కజొన్న చేన్లు నేల వాలాయని, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి రైతులు నష్టపోయారని ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గన్న, ప్రభాకర్, పైండ్ల యాకయ్య, పాపారావు పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 25 : కుల గణనలో సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లకు వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బల్సాషి రమేశ్ అన్నారు. మంగళవారం జిల్లా ముఖ్య గణాంక అధికారి విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే పూర్తి చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు రెమ్యునరేషన్ రాలేదని, విధులకు హాజరై వారికి వెంటనే డబ్బులు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఉపేందర్, విద్యాసాగర్, విజయ్ పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్, మార్చి 25 : వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా వ్యవసాయ పరికరాలకు మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల పేరు మీద పట్టా పాస్‌పుస్తకం ఉన్న వారికి 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. 27 వరకు మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు క్లస్టర్ల వారీగా ఏఈవోలను సంప్రదించాలన్నారు.

ఇనుగుర్తిలో..

ఇనుగుర్తి : మహిళా రైతులకు సబ్సిడీపై కేంద్ర ప్రభుత్వం అందించే వ్యవసాయ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27లోపు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు మహిళారైతు పేరుపై ఉన్న ట్రాక్టర్ ఆర్‌సీ కార్డు జిరాక్స్‌ను మండల కేంద్రంలోని రైతు వేదికలో సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మే ఒకటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

మహబూబాబాద్ రూరల్, మార్చి 25 : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి 31 వరకు గ్రామీణ ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాల లోపు బాల బాలికలు అర్హులని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేదలకు కొత్త మీటర్లు ఇవ్వాలి

మహబూబాబాద్ రూరల్:నిరుపేదలకు వెంటనే కొత్త మీటర్లు ఇవ్వాలని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి అన్నారు. మంగళవారం పట్టణంలోని డీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంట్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. నూతన మీటర్లకు డీడీలు తీసి రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. రాత్రిపూట కరెంట్ లేక అవస్థలు పడుతున్నారని, వెంటనే మీటర్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెరుగుకుమార్, నవీన్, వెంకన్న, శ్రావణ్, ప్రవీణ్, సాంబయ్య పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.41.35 లక్షలు

కురవి : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి హుండీల ఆదాయం రూ.41,35,045లు వచ్చినట్లు ఆలయ ఈవో సత్యనారాయణ, చైర్మన్ రవీందర్‌రెడ్డి తెలిపారు. గతేడాది డిసెంబర్ 26 నుంచి ఈ నెల 24 వరకు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, శక్రునాయక్, ఉప్పలయ్య, చిన్నం గణేశ్, జనార్దన్‌రెడ్డి, సత్యనారాయణ, సంజీవరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

50 మంది వ్యాపారులకు నోటీసులు

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని డ్రైనేజీపై అక్రమ కట్టడాలు నిర్మించిన వ్యాపారులు, గృహ యజమానులకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో తొలగించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూ.5వేల నుంచి రూ.పదివేల వరకు జరిమానా విధించి, షాపు సీజ్ చేస్తామన్నారు. 50 మంది వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్‌కు 28న ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నామినేషన్లు వచ్చాయని, బుధవారం విత్‌డ్రా ఉంటుందని, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులను మొత్తం సభ్యులు కలిసి ఎన్నుకుంటారని తెలిపారు.

ఉపాధి పనులపై నేడు ఓపెన్ ఫోరం

నెల్లికుదురు: ఉపాధి పనులపై నేడు ఓపెన్ ఫోరం (ప్రజా వేదిక) నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలరాజు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 01.04.2023 నుండి 31.03.2024 వరకు మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి పనులపై 15 విడుత సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించిందని, నివేదికకు అనుగుణంగా నేడు మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రజావేదిక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నవోదయకు ఇద్దరు విద్యార్థులు

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న నర్సింహులపేటకు చెందిన రేఖా హర్షిత్, బొజ్జన్నపేట భీమ్లాతండాకు చెందిన బానోత్ శిరీశ్ నవోదయకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ నవోదయకు ఎంపికైన విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలి

దంతాలపల్లి, మార్చి 25 : చిర్ర శ్రీను కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గుండగాని లింగయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన చిర్ర శ్రీను ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడగా, ఆయనను పరామర్శించారు. శ్రీను చెట్టు ఎక్కే పరిస్థితి లేకుండా పోయిందని, ప్రభుత్వం అండగా నిలువాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కారుపోతుల అనిల్, గౌరవ అధ్యక్షుడు అంతయ్య, ఉపాధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి యాకన్న, మల్లేశం, యాకన్న, వెంకటనారాయణ, జంపయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దంతాలపల్లి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వేముల పల్లి శివారు పాలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని బాధ్యుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భూ తగాదాలతో బీభత్సం

తొర్రూరు, మార్చి 25 : జీకే తండాలో రెండు కుటుంబాల మధ్య మంగళవారం భూతగాదా కారణంగా జరిగిన ఘర్షణతో తొర్రూరు పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం.. జీకే తండాకు చెందిన భద్రమ్మ కుటుంబం మంగళవారం ఎల్లమ్మ పండుగ చేయగా, రమేశ్ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని గొడవపడ్డారు. ఈ క్రమంలో రమేశ్ కుటుంబ సభ్యులు భద్రమ్మ దంపతులపై గొడ్డలితో దాడి చేశారు. గాయపడిన భద్రమ్మ, ఆమె భర్తను వెంటనే తొర్రూరులోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. వారు చికిత్స పొందుతున్న సమయంలో రెండు కుటుంబాలు తొర్రూరు పట్టణం అన్నారం రోడ్డు సమీపంలో ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకొని బీభత్సం చేశారు. పోలీసులు ఘటనా స్థలా నికి చేరుకొని ఇరు వర్గాలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.